క్లుప్తంగా

విద్యార్థులకు మెమోరీ టెస్ట్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): దసరా సెలవులను సద్వినియోగం చేసుకునేలా ఠాగూర్ గ్రంథాలయంలో విద్యార్థులకు పలు రకాల పోటీలు నిర్వహించినట్లు గ్రంథాలయాధికారి కె. రమాదేవి తెలిపారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో మంగళవారం విద్యార్థులకు మెమోరీ టెస్ట్ నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు కొన్ని రకాల వస్తువులు, వాటి పేర్లు చూపించి జ్ఞాపక శక్తిని పరీక్షించారు. ఈ టెస్ట్‌లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ జ్ఞాపక శక్తిని ప్రదర్శించారు. పోటీల్లో విజేతలను అధికారులు అభినందించారు. ఈ సందర్భంగా రమాదేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో మానసికోల్లాసానికి ఈ టెస్ట్ దోహదం చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): కుటుంబ గొడవల్లో గాయపడి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న బత్తుల అనిల్‌కుమార్(40) అనే వ్యక్తి మృతి చెందడంతో నున్న పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు.. 62వ డివిజన్ పటేల్‌నగర్‌కు చెందిన అనిల్‌కుమార్ పెయింటింగ్ పని చేస్తుంటాడు. మొదటి అంతస్తులో ఉంటున్న అనిల్‌కుమార్, రెండవ అంతస్తులో ఉంటున్న అతని అన్న కిరణ్ తరుచుగా కుటుంబ విషయాలపై గొడవపడుతుంటారు. ఈనెల 7వ తేదీ రాత్రి ఇద్దరి మధ్య గొడవ జరగ్గాపై అంతస్తు నుంచి అనిల్‌కుమార్‌ని కిరణ్ తోసివేశాడు. కింద రోడ్డుపై పడిన అనిల్‌కుమార్ తలకు బలమైన గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుని భార్య కవిత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

చిన్నారుల్లోని ప్రతిభను ప్రోత్సహించాలి



విజయవాడ కల్చరల్: చిన్నారుల్లోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని నాట్యాచారిణి మొక్కపాటి అవంతి అన్నారు. దసరా మహోత్సవాల్లో భాగంగా సత్యనారాయణపురంలోని సీతారామ కల్యాణ మండపంలో కూచిపూడి నత్యప్రదర్శనలు, వాటిలో పాల్గొన్న చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికల పంపిణీ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దసరా మహోత్సవాల్లో అమ్మవారికి నృత్యనీరాజం చేయడం అదృష్టంగా భావించాలని అన్నారు. కూచిపూడి సంప్రదాయంలో చిన్నారులు పలు నృత్యాలను ప్రదర్శించారు. కమలేక్షిణి నాట్యవిద్యాలయం నిర్వాహకురాలు డి. సాయిలక్ష్మి బృందం కాశీ విశాలాక్షికి నృత్యనీరాజనం అందించారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలను అందజేశారు.

మూలా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక సౌకర్యాలు

పటమట(విజయవాడతూర్పు): ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న దుర్గామల్లేశ్వర దేవస్థానం ఆధ్వర్యంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో మూలా నక్షత్రం రోజున భక్తులకు ఎలాంటి సమస్యలు లేకుండా అన్ని చర్యలు తీసుకోవాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. మంగళవారం వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో ఆయన అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూలా నక్షత్రం రోజు అమ్మవారి దర్శనానికి భక్తులు ఎక్కువగా వచ్చే అవకాశాలు ఉన్నాయని, ఏర్పాట్లను మరింత పెంచి, భక్తులకు ఎలాంటి ఇబ్బంది, లోటుపాట్లు లేకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. భక్తులు అధిక శాతంలో వచ్చే అవకాశం ఉన్నందున క్యూ లైన్‌లో ఉన్న భక్తులకు తాగు నీరు అందించాలని ఆదేశించారు.

వైభవంగా సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు



మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో సాయినాథుని పుణ్యతిథి మహోత్సవాలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. లోక కల్యాణార్థం సాయినాథ, సుబ్రహ్మణ్య హోమం నిర్వహించారు. కార్యక్రమంలో మందిర గౌరవాధ్యక్షుడు డాక్టర్ పూనూరు గౌతంరెడ్డి దంపతులు పాల్గొని పూజలు చేశారు. గౌతంరెడ్డి మాట్లాడుతూ బాబావారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ లభించాలని ఆకాంక్షించారు. అనంతరం అన్నప్రసాద వితరణ జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పుణ్యతిథి మహోత్సవాల్లో భాగంగా భారతీ రాఘవ నృత్య కేంద్రం, అపర్ణప్రసాద్ బృందం చేసిన కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆహుతులను అలరించాయి. కూచిపూడి నృత్యాలు పేక్షకులను మంత్రముగ్ధుల్ని చేశాయి. అనంతరం ఆలయ కమిటీ అధ్వర్యాన కళాకారులను జ్ఞాపికలతో సత్కరించారు.

చెరువుకు గండి.. పూడ్చేది ఎప్పుడండీ!

- వందలాది ఎకరాల ఆయకట్టు భూములకు సాగునీటి కొరత
- మరమ్మతులకు అంచనాలు కూడా వేయని అధికారులు
- గండి పూడ్చడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం



కుందావారి కండ్రిక చెరువుకు పడిన గండి

పాయకాపురం(విజయవాడరూరల్): ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా విజయవాడ 64వ డివిజన్ విలేజి కండ్రికలో కుండోడి చెరువుకు పడిన గండిని పూడ్చడంలో కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. వరదల్లో పంటలు మునిగిపోయిన రైతాంగానికి నష్టపరిహారం అందజేయడంలోనూ పూర్తిగా విఫలమైంది. అంతేకాకుండా వరదల్లో గండ్లు పడిన కాల్వలకు, చెరువులకు మరమ్మతులు చేయడంలో మీనమేషాలు లెక్కిస్తోంది. అధికారంలోకి వస్తే రైతులకు వెన్నుదన్నుగా ఉంటామని ఎన్నికల్లో హామీలిచ్చిన నేతలు ఇప్పుడు నోరు మెదపడంలేదని రైతులు అంటున్నారు. నెలరోజుల క్రితం వచ్చిన వరదల్లో గొల్లపూడి-ముస్తాబాదు పంపింగ్ స్కీమ్ కాల్వకు అనేక చోట్ల గండ్లుపడ్డాయి. అదేవిధంగా కుందావారి కండ్రిక చెరువుకు పెద్ద గండిపడి నీరు వాగులో నుంచి వెళ్లి పంట పొలాలను నష్టపర్చింది. ఇంతవరకు గండ్లు పడిన ప్రాంతాలను ఇరిగేషన్ అధికారులు వచ్చి పరిశీలించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని తెలియజేస్తోంది. మైనర్ ఇరిగేషన్ శాఖకు చెందిన కుందావారి కండ్రిక చెరువు ఆయకట్టు పరిధిలో 265 ఎకరాల వ్యవసాయ భూములు ఉన్నాయి. కుందావారి కండ్రిక, పాతపాడు, నున్న గ్రామాల రైతులకు చెందిన వ్యవసాయ భూముల్లో అధిక భాగం మొన్న వచ్చిన వరదలకు నష్టపోయాయి. ఎకరాకు రూ. 20 వేల వరకు పెట్టుబడి పెట్టి వ్యవసాయం చేసిన రైతులకు వరదలు మరింత నష్టానికి గురిచేశాయి. మరో రెండు నెలల్లో దాళ్వా వరిసాగు చేసుకునేందుకు సాగునీరు అవసరం ఉంటుంది. గండ్లు పూడ్చకపోవడం వల్ల పోలవరం కాల్వ నుంచి నీరు పెట్టుకొనే అవకాశం కూడా లేదని రైతులు వాపోతున్నారు.

పంటపొలాలకు వెళ్లే మార్గం లేదు



వరదల్లో కుందావారి కండ్రిక చెరువుకు పడిన గండిని ఇంత వరకు అధికారులు పట్టించుకోలేదు. చెరువుకు గండిపడటంతో రైతులు పంటపొలాలకు వెళ్లే మార్గం లేక అవస్థలు పడుతున్నాం. గండికి ఆనుకొని ఉన్న వాగు కూడా పూర్తిగా కోతకు గురికావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు స్పందించి వెంటనే చెరువుకు పడిన గండ్లు పూడ్చాలి.

– భీమిరెడ్డి సాంబిరెడ్డి, కుందావారి కండ్రిక

చెరువుకు వెంటనే మరమ్మతులు చేపట్టాలి



కుందావారి కండ్రిక చెరువుకు పడిన గండిని అధికారులు వెంటనే పూడ్చాలి. వరదలు వచ్చి ఖరీఫ్ పంటలను కోల్పోయిన రైతులు దాళ్వా ఊడ్చేందుకు అవసరమైన సాగునీటిని చెరువులో నింపేందుకు గండ్లు పూడ్చాల్సిన అవసరం ఉంది. ఇరిగేషన్ అధికారులు వెంటనే చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నాం.

– అవుతు జానారెడ్డి, కుందావారి కండ్రిక

దుర్గమ్మకు నాట్యనీరాజనం



నృత్యాలను ప్రదర్శిస్తున్న చిన్నారులు

విజయవాడ కల్చరల్: శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానం ఆధ్వర్యంలో కనక దుర్గానగర్‌లోని కళావేదికపై కళాకారులు ప్రదర్శిస్తున్న అంశాలు నేత్ర పర్వంగా సాగుతున్నాయి. మంగళవారం ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారులతోపాటు, బరంపురం, చెన్నై నుంచి వచ్చిన నృత్య కళాకారులు నృత్యసేవలో పాల్గొన్నారు. టి. వెంకటలక్ష్మి బృందం భక్తి సంగీతంతో ప్రారంభమయ్యాయి. బి.శ్రావణి, సీహెచ్ రవి అమ్మవారి మీద కృతులను ఆలపించారు. నృత్య కార్యక్రమంలో భాగంగా కె. చిన్నమయాచార్యులు, భాగవతుల వెంకట్రామ శర్మ, కె. నిర్మలాకుమారి, లాస్య, టి. సాయి కృష్ణ, శారదా రామకృష్ణ, జె. రమ్యవేద, భాగవతుల శ్రీనివాస శర్మ, బి. మల్లికార్జున రావు, దేవరకొండ చంద్రశేఖర్, దిలీప్ రాజన్, సీహెచ్ అజయ్‌కుమార్ తమ బృందాలతో కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, జానపద నృత్యాలను ప్రదర్శించారు. కార్యక్రమాలను గంగాధర్, సైదా, రామకృష్ణ నిర్వహించారు. కళాకారులకు ప్రశంసాపత్రాలను అమ్మవారి లడ్డూ ప్రసాదాలను నిర్వాహకులు అందజేశారు.

కళాకారులనూ అడ్డుకున్న పోలీసులు..

కనకదుర్గానగర్‌లో కళాకారుల కోసం నిర్మించిన వేదిక, కనక దుర్గానగర్‌కు వెళ్లడానికి ఎంట్రన్స్ పక్కపక్కనే ఉంటాయి. కొంతమంది పోలీసు అధికారులు పాస్ ఉంటేనే లోపలకి అనుమతినిస్తామని మొండికేస్తున్నారు. దీంతో కళాకారులు ఇబ్బందులు పడుతున్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరికీ అందాలి

శివకామేశ్వరీదేవి సేవలో మేయర్ భాగ్యలక్ష్మి



మేయర్ భాగ్యలక్ష్మిని ఆశీర్వచనం చేస్తున్న వేదపండితులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): అమ్మవారి ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ అందాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక అయోధ్యనగర్ శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో జరుగుతున్న శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం ఆమె పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో ఎంతో మహిమాన్వితమైన శివకామేశ్వరీ అమ్మవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రతీ ఏటా అంగరంగ వైభవంగా ఉత్సవాలు నిర్వహిస్తున్న పీఠం వ్యవస్థాపకుడు అవ్వా హేమసుందర వరప్రసాద్‌ను అభినందించారు. లోక కల్యాణార్థం చేస్తున్న హోమాలు, పూజల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రంతో మేయర్ భాగ్యలక్ష్మిని పీఠం వ్యవస్థాపకుడు హేమసుందర వరప్రసాద్ వేదపండితుల మంత్రోచ్చారణలతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ డివిజన్ ఇన్‌ఛార్జి గుండే సుందర్‌పాల్, గొల్ల రంగారావు తదితరులు పాల్గొన్నారు.

రేపు ధర్నాచౌక్‌వద్ద వైఎస్సార్ సీపీ నిరసన

మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు

మధురానగర్(విజయవాడసెంట్రల్): బుడమేరు వరద బాధితులను ఆదుకోవడంలో విఫలమైన కూటమి ప్రభుత్వ విధానాలను నిరసిస్తూ ఈనెల 10వ తేదీ గురువారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ధర్నా చౌక్ వద్ద నిరసనకు పిలుపునిచ్చినట్లు ఆ పార్టీ సెంట్రల్ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తి నెల రోజులు దాటినా బాధితుల కష్టాలు తీరలేదని ఆయన ఆరోపించారు. సర్వస్వం కోల్పోయిన బాధితులు పరిహారం కోసం పడరాని పాట్లు పడుతున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి బాధితులకు పూర్తి న్యాయం జరిగేలా వైఎస్సార్ సీపీ నిరసనకు పిలుపునిచ్చిందని పేర్కొన్నారు. కావున ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, డివిజన్ ఇంచార్జిలు, కోఆర్డినేటర్లు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని మల్లాది విష్ణు పిలుపునిచ్చారు.

మహాలక్ష్మీ నమోస్తుతే..

నగరంలో శ్రీదేవి శరన్నవరాత్రుల మహోత్సవాలు అత్యంత వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం భక్తులు పెద్ద సంఖ్యలో దేవాలయాల్లో వివిధ రూపాల్లో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. పలు ఆలయాల్లో సామూహిక కుంకుమార్చనలు జరిగాయి.

– విజయవాడ కల్చరల్, మధురానగర్(విజయవాడసెంట్రల్)



లబ్బీపేట శారదా చంద్రమౌళేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మిగా పూజలందుకుంటున్న అమ్మవారు




శ్రీపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామివారి ఆలయంలో..



శివరామకృష్ణ క్షేత్రంలో మోహినీ దేవి అలంకారం



శ్రీదత్తసాయి శివకామేశ్వరీ పీఠంలో అమ్మవారు



దుర్గాపురంలో మహాలక్ష్మిదేవి అలంకారం



నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో ధనలక్ష్మీదేవి



రామలింగేశ్వరపేటలో శ్రీమహాలక్ష్మీదేవి అలంకారం

ఘనంగా ముర్రాట్ల ఉత్సవం

మధురానగర్(విజయవాడసెంట్రల్): దావు బుచ్చయ్యకాలనీలోని గ్రామదేవత శ్రీ శ్యామలాంబదేవి ఆలయంలో మంగళవారం ముర్రాట్ల ఉత్సవం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో మహిళా భక్తులు పసుపు నీళ్ల నెత్తిన పెట్టుకుని జై శ్యామలాంబదేవి, జై దుర్గా అంటూ నినాదాలు చేస్తూ జీవీఆర్‌నగర్, దావు బుచ్చయ్యకాలనీ, వినాయకనగర్ ప్రాంతాల్లో మేళతాళాలు, డప్పు వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహించారు. బేతాళసెట్టు విన్యాసాలు దారిపొడవునా భక్తులను అలరించాయి. అనంతరం ముర్రాట్లను భక్తులు, మహిళలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ ధర్మకర్త చింతపల్లి కనకారావు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురవడంతోపాటు ప్రజలు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని తాము ప్రతీ ఏటా అమ్మవారికి ముర్రాట్లను సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఆలయ అర్చకులు అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కె. ఉషాజ్యోతి, ఎం. శివరామలక్ష్మణ్, కరణం శ్రీరాములు, సాధు వెంకట్రావు, కె. చిరంజీవి, ఎస్. సాయినాగు పాల్గొన్నారు.



ముర్రాట్ల ఉత్సవంలో నెత్తిన పసుపు నీళ్లతో మహిళలు



బేతాళసెట్టు విన్యాసం

పర్యావరణంపై అవగాహనకు జేవీవీ కృషి

జేవీవీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గేయానంద్, కుర్రా రామారావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): జన విజ్ఞాన వేదిక శాస్త్ర ప్రచార రంగంలోనే కాకుండా అనేక ఇతర రంగాల్లో కూడా విస్తృతమైన కృషి చేయాలని కమిటీ సమావేశంలో నిర్ణయించినట్లు జేవీవీ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ గేయానంద్, కుర్రా రామారావు తెలిపారు. రాఘవయ్య పార్క్ సమీపంలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జన విజ్ఞాన వేదిక(జేవీవీ) రాష్ట్ర వర్క్‌షాప్, రాష్ట్ర కమిటీ విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశం వివరాలను గేయానంద్, రామారావులు మీడియాకు వివరించారు. ఈ వర్క్‌షాప్‌లో రాబోయే సంవత్సర కాలంలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై చర్చించామన్నారు. ముఖ్యంగా జేవీవీ ఆవిర్భావం నుంచి ఆరోగ్య రంగంలో శాస్త్రీయమైన పద్ధతుల్లో మందులు ఎలా వాడాలనే అంశంపై ప్రచారం చేస్తోందన్నారు. అదేవిధంగా విద్యా రంగంలో పిల్లల చుట్టూ చదివే ఉండాలి, వారి ప్రయోజనాలకు అనుగుణంగా బడులు ఎలా ఉండాలనే దానిపై పెద్ద ఎత్తున ప్రచారం చేసిందన్నారు. విద్యా, వైద్య రంగాల్లో శాస్త్రీయ భావాల ప్రచారం అనేది మరింత ప్రణాళికా బద్ధంగా చేయాలని కమిటీ నిర్ణయించిందని వివరించారు. పర్యావరణం, వాతావరణ మార్పులు పెద్ద సమస్యగా మారిందని, ప్రజలందరికీ దీనిపై శాస్త్రీయమైన అవగాహన అవసరం పేర్కొన్నారు. ఇది సైంటిఫిక్ అంశమని, ఆ రంగంలో నిపుణులను కలుపుకొని ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. గత 34 ఏళ్లుగా జరుపుతున్న చెకుముకి సైన్స్ సంబరాలు, గత రెండు సంవత్సరాలుగా చేస్తున్న ఆన్‌లైన్ సైన్స్ పరిశోధనలు, కాంపిటీషన్స్ వంటి వాటన్నింటిని మరింత సృజనాత్మకంగా ముందుకు తీసుకువెళ్లాలని సమావేశం నిర్ణయించిందని వివరించారు.

ఉత్సవాల నిర్వహణలో ఘోర వైఫల్యం

దుర్గ గుడి పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు ప్రశ్నలు



పాలక మండలి కాలపరిమితికి సంబంధించిన జీఓ కాపీని చూపుతున్న రాంబాబు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాల నిర్వహణలో కూటమి ప్రభుత్వం ఘోరంగా వైఫల్యం చెందిందని దుర్గ గుడి పాలక మండలి చైర్మన్ కర్నాటి రాంబాబు అన్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఎక్కడెక్కడ నుంచో వస్తున్న భక్తులు పడుతున్న కష్టాలే అందుకు నిదర్శనమన్నారు. రూ.500ల టికెట్ కొనుక్కొని క్యూ లైన్‌లో గంటల తరబడి పిల్లలు, వృద్ధులతో వేచి ఉండాల్సి వస్తోందంటే.. ఇది నిర్వహణ లోపం కాదా అని ప్రశ్నించారు. విజయవాడ కేఎల్‌రావు నగర్‌లోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జిల్లా యంత్రాంగం, ఆలయ కార్యనిర్వహణాధికారిపై ధ్వజమెత్తారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పాలక మండలి పదవీ కాలం ఉండగా ఉత్సవాలకు సంబంధించి సూచనలు, సలహాలు తీసుకోకుండా ఏక పక్ష నిర్ణయాలు ఎలా తీసుకుంటారని నిలదీశారు. ఉత్సవాలకు ముందు జిల్లా యంత్రాంగం నిర్వహించిన కో ఆర్డినేషన్ సమావేశాలకు సైతం పాలక మండలిని పిలువలేదన్నారు. పాలక మండలి రద్దు అయ్యిందని చెబుతున్న ఆలయ ఈఓ అందుకు సంబంధించిన జీఓ ఎందుకు విడుదల చేయలేదని ప్రశ్నించారు.

ఉత్సవాల పేరుతో దోచుకుంటున్నారు..

దసరా ఉత్సవాల్లో భక్తులకు తగిన సౌకర్యాలు కల్పించాల్సిన కూటమి ప్రభుత్వం నాయకులు అందినకాడికి దోచుకుంటున్నారని చైర్మన్ కర్నాటి రాంబాబు మండిపడ్డారు. అందులో భాగంగానే జీరో టికెట్ విధానాన్ని ప్రవేశపెట్టి అమ్మవారి ఆదాయానికి పెద్ద ఎత్తున గండి కొడుతున్నారని, అసలు జీరో టికెట్ ప్రతిపాదన ఎవరు చేశారో ఈఓ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలనలో రూ.10 కోట్లతో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా నిర్వహించామని గుర్తు చేశారు. ఈ ఏడాది దసరా ఉత్సవాలకు ప్రభుత్వం రూ.15 కోట్లు కేటాయించిందని, అయినా భక్తులకు కష్టాలు తప్పలేదని అన్నారు. అమ్మవారి ఆదాయానికి గండి పడకూడదనే ఉద్దేశంతో గత దసరా ఉత్సవాల్లో అప్పటి దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ లక్షలాది రూపాయల సొంత ఖర్చుతో టికెట్లు కొని జిల్లా యంత్రాంగానికి పంపిణీ చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం జీరో టికెట్ పెట్టి రీసైక్లింగ్ చేస్తూ దోచుకుంటుందని విమర్శించారు.

న్యాయపరంగా ముందుకు..

దసరా ఉత్సవాలను రాజకీయాలకు అతీతంగా నిర్వహించాల్సి ఉండగా ప్రతిపక్షంపట్ల వివక్ష చూపుతోందని చైర్మన్ కర్నాటి రాంబాబు విమర్శించారు. నగర ప్రథమ పౌరురాలైన నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మికి ప్రొటోకాల్ దర్శనం చేయించాల్సి ఉండగా అడుగడుగునా అడ్డంకులు సృష్టించి అవమానించటం దుర్మార్గమన్నారు. ఉత్సవాల్లో ఉత్సవ కమిటీ వేస్తారుగానీ కూటమి ప్రభుత్వం మాత్రం సేవా కమిటీ పేరుతో జంబో కమిటీ వేసిందని, వారంతా కేవలం తమవారికి మాత్రమే దర్శనం చేయించటానికి పరిమితం అవుతున్నారు తప్ప భక్తులకు సేవలు అందించటం లేదని విమర్శించారు. దసరా ఉత్సవాలు, పాలక మండలికి సంబంధించిన పలు అంశాలపై ఈఓ, దేవదాయ శాఖ మంత్రి, కమిషనర్‌కు లేఖ రాశానని, వారిచ్చిన సమాధానం తరువాత న్యాయపరంగా ముందుకు వెళతానని చెప్పారు. సమావేశంలో పాలక మండలి సభ్యులు నంబూరి రవి, భక్తుడు కేసరి కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



నగరోత్సవంలో పాల్గొన్న ఈఓ రామరావు, ఇతర సిబ్బంది

భక్తులు, భవానీలతో కిక్కిరిసిన అమ్మవారి ప్రాంగణం

కుంకుమ పూజ చేస్తున్న దంపతులు

ముస్తాబవుతున్న హంసవాహనం

చిన్నారికి దర్శనం చేయిస్తున్న పోలీసులు

సువాసినీ పూజ చేస్తున్న అర్చకుడు

శ్రీదేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి శోభాయమానంగా వెలుగొందుతోంది. నలుదిక్కులా ఆధ్యాత్మిక పరిమళం వెదజల్లుతోంది. అమ్మవారి దివ్య అలంకారాలను దర్శించుకుని భక్తులు భక్తి పారవశ్యంలో మునిగిపోతున్నారు. నవరాత్రుల్లో భాగంగా మంగళవారం అమృత స్వరూపిణి అయిన శ్రీమహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ